క్లుప్తంగా

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడిగా ధర్మరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు ధర్మరాజు

కాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ఆనందపురం సర్పంచ్ కొలకలూరి ధర్మరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎన్నికలను నిర్వహించినట్లు ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో వారధి ప్రక్కనున్న తాడేపల్లిలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్ సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగిందన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): గర్భిణులు, శిశువులకు ఇచ్చే వైద్య సేవల్లో నూరుశాతం ప్రగతి సాధించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా వైద్యాధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, సమస్యాత్మక గర్భవతుల గుర్తింపు చేపట్టాలని అన్నారు. 0–5 ఏళ్ల లోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను సమయానికి వేయాలని సూచించారు. డెలివరీ దగ్గరలో ఉన్న వారికి ప్రత్యేక శ్రద్ధ వహించి ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.సుధాలక్ష్మి, డాక్టర్ జె.సుగుణ రాజు, ఏఓ డాక్టర్ జె.వి.రామన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి గరుడ వాహన సేవ



వెంకటేశ్వరస్వామికి గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసి యున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్య మాసం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవెంకటేశ్వరస్వామికి, అమ్మవార్లకు గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆర్.గంగశ్రీదేవి, ఛైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీరవాసరం: మండలానికి చెందిన చెన్ను దుర్గా ప్రవీణ్ కనిపించడం లేదని తల్లి చెన్ను శారదా లక్ష్మి ఫిర్యాదు చేశారని ఎస్సై పి.రమేష్ తెలిపారు. గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాడని, ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పొందుతున్నాడని తెలిపారు. పక్కంటి వారితో జరిగిన గొడవ కారణంగా అలిగి 5న వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చోరీ కేసుల్లో నలుగురికి ఏడాది జైలు శిక్ష

పాలకోడేరు: మండలంలోని పలు గ్రామాల్లో మోటారు బైక్ లు దొంగతనం చేసిన కేసుల్లో నేరం రుజువు అవ్వడంతో కోర్టు నలుగురు దోషులకు ఏడాది చొప్పున జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా వున్నాయి. వీరవాసరం గ్రామానికి చెందిన గెడ లక్ష్మి వెంకట చైతన్య, దైవాల మోహన్, చవ్వాకుల రామకృష్ణ, పెరుమాళ్ పవన్ కుమార్‌లను గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు అరెస్టు చేసి విచారణ నిర్వహించగా, పాలకోడేరు పోలీసులు వీరిపై పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు గ్రామాల్లో జరిగిన బైక్ దొంగతనాల కేసులు నమోదు చేశారని వెల్లడైంది. దాంతో వారి నుంచి ప్రాపర్టీ రికవరీ చేసి కోర్టులో హాజరు పరచగా భీమవరం మొదటి తరగతి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని పాలకోడేరు ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రామతులసి వాదించారు.

రబీలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



కోళ్లపర్రులో మాట్లాడుతున్న ఏడీఏ కెఎస్ఎస్. శ్రీనివాసరావు.

ఆకివీడు: యాజమాన్య పద్ధతులు పాటించి రబీలో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కోళ్లపర్రు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఆత్మ అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దమ్ము పనుల్లో యజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా భూమిలో సారం పెరుగుతుందన్నారు. దమ్ము లోతుకంటా చేయడం ద్వారా భూమిలోని సారం బయటపడి మొక్కలకు దక్కుతుందన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ నీటితో సాగు చేసి, దుబ్బులు అధికంగా వేసే విధంగా కృషి చేయాలన్నారు. తడి పొడి సాగుతో మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల్ని వాడాలని శ్రీనివాసరావు సూచించారు. మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో వచ్చే సమస్యలకు పరిష్కార మార్గాలు తెలియజేశారు. రబీ నాట్లు వేసిన రైతులు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శిరీష, రైతులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలిని విచారించిన డీవైఈవోలు



విచారణ నిర్వహిస్తున్న డీవైఈవోలు రవీంద్ర భారతి, శ్రీరామ్‌లు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గూట్లపాడులో మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శివ నాగజ్యోతిని శుక్రవారం తాడేపల్లిగూడెం, భీమవరం డీవైఈవోలు రవీంద్ర భారతి, శ్రీరామ్, విస్సాకోడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వాణి విజయరత్నంలు విచారించారు. గతంలో ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలలో పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న దాసి లక్ష్మీ ప్రసన్నను కులం పేరుతో దూషించినట్లు ఆరోపణలు వచ్చాయి. అదే కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న చీడే సత్యవాణి కలుగజేసుకుని ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించంగా సెల్ ఫోన్ లాక్కుని వారిపై దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది. శుక్రవారం పాఠశాలకు వచ్చి ఇరు వర్గాలను విచారించారు. డీవైఈవోలు మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, సర్పంచ్ భర్త ఒడుగు ముత్యాలరావు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు చాలా సార్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై దురుసుగా మాట్లాడటంతో గతంలో ఎన్నోసార్లు పెద్దల సమక్షంలో పలు సమస్యలను పరిష్కరించామని ఆమె తీరు మార్చుకోవడం లేదని చెప్పారు.

దత్త క్షేత్రంలో విశేషపూజలు



దత్త క్షేత్రంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

ఆకివీడు: స్థానిక దత్త క్షేత్రంలో శుక్రవారం ధనుర్మాసంలో వచ్చే పుష్య పౌర్ణమి మహోత్సవాన్ని, భగవద్గీతా పారాయణాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్త హోమం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో న్యాయమూర్తులు పవన్‌కుమార్, సోనిలు పాల్గొన్నారు. భగవద్గీత పారాయణంను కె.రాజ్యలక్ష్మి(ఆచార్య అక్కయ్య) ఆధ్వర్యంలో 200 మంది మహిళలు సంపూర్ణ పారాయణం చేశారు. తొలుత దత్తాత్రేయుడికి అభిషేకాలు నిర్వహించారు. దత్త క్షేత్ర కార్యదర్శి కె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 40 ఏళ్లపాటు విష్ణు, లలితా సహస్రపారాయణం, భగవద్గీత పారాయణం, తిరుప్పావై పారాయణాన్ని మహిళలతో చేయిస్తున్న కె.రాజ్యలక్ష్మి (ఆచార్య అక్కయ్య)ను దత్త క్షేత్ర కమిటీ, భక్తులు ఘనంగా సత్కరించారు.

మోషేనురాజును కలిసిన జాన్సన్



భీమవరంలో మోషేనురాజు కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న జాన్సన్, చిత్రంలో పీవీఎల్

సాక్షి, భీమవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మేడిది జాన్సన్ శుక్రవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజును క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ పార్టీ పటిష్టానికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తదితరులున్నారు. మేడిది జాన్సన్‌ను దళిత ఐక్యవేదిక నాయకులు అభినందించారు. జాన్సన్ నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జాన్సన్‌ను కలసినవారిలో భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, దళిత సంఘం నాయకులు పాలపర్తి జోనా, మరపట్ల మునియ్య, గెడ్డం జార్జి తదితరులున్నారు.

జాన్సన్‌కు అభినందనల వెల్లువ

భీమవరం(ప్రకాశం చౌక్): క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మేడిది జాన్సన్‌కు శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఆవరణలో అభినందించారు. అందరిని కలుపుకునే స్వభావం ఉన్న జాన్సన్‌కు పదవి రావడం గొప్ప విశేషమని పలువురు వక్తలు అన్నారు. చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, నందమూరి రాజేష్, నరహరిశెట్టి కృష్ణ, కుక్కల బాల వెంకటరత్నం, గంటా సుందర కుమార్, పాలపర్తి జోనా పాల్గొన్నారు. అలాగే ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన నాయకులు కూడా జాన్సన్‌ను అభినందించారు. సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి జి.సుందర్‌కుమార్, సచివాలయ కన్వీనర్ వెలగపల్లి టోనీ, పాస్టర్ పురుషోత్తం, గొర్రుముచ్చు సామ్యూల్, కోలాటి శ్యాం, యాళ్ళ జక్కరయ్య, యేలేటి గజేంద్ర పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఉండి: సదరం సర్టిఫికెట్లు పొందేందుకు స్లాట్ బుకింగ్ సోమవారం నుండి ప్రారంభమైందని ఎంపీడీఓ ఏవీ అప్పారావు శుక్రవారం తెలిపారు. కొత్తవారు దరఖాస్తు చేసుకోవడంతో పాటు పాతవారు అప్పీల్ చేసుకునేందుకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆయన అన్నారు. గతంలో తక్కువ పర్సెంటేజ్ వచ్చిన వారు, రిజెక్ట్ అయ్యిన వారు, టెంపరరీ సర్టిఫెట్లు పొందిన వారు సదరం 1 ద్వారా వారి ఐడీతో దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు.అప్పీల్ 1లో రిజెక్ట్ అయిన వారు అప్పీల్ 2లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అయితే అప్పీల్ 2లో రిజెక్ట్ అయితే మరోసారి అవకాశం ఉండదని తెలిపారు.అప్పీల్ 1, 2 వారికి వైకల్యం నిర్ధారించేందుకు ఆన్‌లైన్‌లోనే ఆసుపత్రి కేటాయిస్తారని, ఆ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించాకోవాలని సూచించారు.

నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం అండ



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు

సాక్షి, భీమవరం: నాయి బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భీమవరంలో జరిగిన పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికల్లో ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి తమ కమ్యూనిటీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతం నుంచి నాయి బ్రాహ్మణ సంఘాలకు తాను అండగా ఉంటున్నానని భవిష్యత్తులో కూడా అదే విధంగా సహకారం అందిస్తానన్నారు. శ్రీనివాస్‌ను కలసిన వారిలో సంఘం నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మలువలస రఘుబాబు, తురువాల దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు మలువలస మావుళ్ళు, వ్యాపాడ పెద్దిరాజు, సహాయ కార్యదర్శులు సారిక దుర్గారావు, తుంపాల నరేష్ కుమార్, కోశాధికారి గూడవలస ఏసు, గౌరవాధ్యక్షుడు తుంపాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూదాలకు దూరంగా ఉండాలి

పాలకోడేరు: కబడ్డీ, ఖోఖో వంటి సాంప్రదాయ క్రీడలు ఆడుతూ యువత జూదాలు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వి.వి.వి.ఎస్.ఎన్.వర్మ తెలిపారు. శృంగవృక్షం, వంకాయలపాలెం గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహించరాదని ఎస్ఈబీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం ప్రకారం కోడిపందేలు నిర్వహించడం, అందుకు తమ స్థలం ఇవ్వడం, పేకాట, గుండాటలు నిర్వహించడం నేరమని తెలియజేశారు. రాబోయే సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, పరుగు పందెం, ముగ్గులపోటీలు లేదా పాటల పోటీలు వంటివి నిర్వహించి ఇంటిల్లపాదీ సరదాగా ఆనందంగా పండుగ జరుపుకోవాలని కోరారు., కోడిపందేలు, జూదం, నాటుసారా, మద్యం అక్రమ అమ్మకం వంటి నేరాల సమాచారాన్ని ఎస్ఈబీ టోల్ ఫ్రీ నెంబరు 14500 కు తెలియజేయాలన్నారు. ఎస్ఈబీ సిబ్బంది డి.శ్రీనివాసరావు, హెచ్‌సీ వి.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి గాజుల ఉత్సవం



ధనుర్మాసంలో పౌర్ణమి నాడు శుక్రవారం రావడంతో కాళ్ల మండలం కోమటిగుంటలో కొలువైవున్న దుర్గాదేవి అమ్మవారికి గాజుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని గాజులతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎస్వీ పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. నిండుగా గాజులతో కొలువైన అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించి తరించారు. ఉత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త ఎరుబండి రామాంజనేయులు, చైర్మన్ కొర్రకూటి సత్యనారాయణ పాల్గొన్నారు. - కాళ్ల

ఉన్నత విద్య అందించడమే లక్ష్యం



సీతాపాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థిని నృత్య ప్రదర్శన

సాక్షి, భీమవరం: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో బీవీ రాజు 25 ఏళ్ల క్రితం సీతాపాలిటెక్నిక్ కళాశాల ప్రారంభమైందని విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కేవీ విష్ణురాజు అన్నారు. కళాశాల 25 వసంతాల వేడుకను శుక్రవారం నిర్వహించిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతోమంది నేడు ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. భవిష్యత్తులో సివిల్, మెకానికల్ డిప్లమో విద్యార్థుల అవసరం ఎంతో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు డిప్లమో విద్యతో పాటు పారిశ్రామిక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.


కొరమేను పెంపకంపై దృష్టి పెట్టాలి



కొమరాడలో యూనో ఫీడ్స్ పరిశ్రమలో మత్స్య కళాశాల విద్యార్థుల బృందం

భీమవరం అర్బన్: వనామీ రొయ్యలు, శీలావతి, కట్ల వంటి సప్ప నీటి చేపల మార్కెట్‌కు ఇటీవల ఒడుదుడుకులు ఉండటంతో కొరమేను పెంపకంపై ఆక్వా రైతులు దృష్టి సారించాలని నెల్లూరు జిల్లా మత్స్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దీప్తి, త్రివేణిలు అన్నారు. భీమవరం మండలంలోని కొమరాడ గ్రామంలో యూనో ఫీడ్స్‌ను శుక్రవారం నెల్లూరు జిల్లా మత్స్య కళాశాల విద్యార్థుల బృందం పరిశీలించింది. కొరమేను పెంపకం చేసే చెరువులను మేతను, ఫీడ్ తయారు చేసే పరిశ్రమను పరిశీలించారు.

ఉమా మూలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ఉమా మూలేశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: శుక్రవారం రాయకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా మూలేశ్వర స్వామి దేవస్థానంలో శివ ముక్కోటి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. బ్రహ్మశ్రీ సుదురుపాటి గంగాధర శాస్త్రి దంపతులచే గరికతో వినాయక పూజ, మహాన్యాస పూర్వక అన్నాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, వివిధ రకములైన ద్రవ్యాలతో పళ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. రుద్ర హోమం, పూర్ణాహుతి, లక్ష బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, శాంతి కళ్యాణం, నీరాజనం మంత్రపుష్పము, వేద పారాయణము చేపట్టారు.

ఫ్యామిలీ డాక్టర్ ఓ మంచి కార్యక్రమం



ఉండిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మోహన్‌రావు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చాలా మంచిదని జిల్లా వైద్యాధికారి(డీఎంఅండ్‌హెచ్‌ఓ) డాక్టర్ డి.మోహన్‌రావు అన్నారు.శుక్రవారం ఉండి, ఎన్నార్పీ అగ్రహారంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్,డ్రైడే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరుపై సూచనలు,సలహాలు అందించారు. అనంతరం ఉండిలో నిర్వహించిన డ్రైడే ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ వెంకటేశ్వర్లు,మండల వైద్యాధికారి పి ధర్మతేజ్, 104 వైద్యుడు నరసరాజు, సీహెచ్ ఆర్ కృష్ణకిశోర్, పీహెచ్ఎన్ హెప్సీ కుమారి పాల్గొన్నారు.

పెన్షన్ల పెంపుతో ఆనందం



వెంప గ్రామంలో కొత్తగా మంజూరైన పెన్షన్ అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పెన్షన్లు పెంపుతో అవ్వతాతలు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి కృష్ణంరాజు, సొసైటీ త్రి సభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజులు అన్నారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌దారులకు శుక్రవారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా అల్లూరి కృష్ణంరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చాడంటే కచ్చితంగా నెరవేరుస్తారని, అదే విశ్వాసంతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఉన్నారన్నారు. మూడున్నరేళ్లలో ఎన్నికలలో ఇచ్చిన హామీలను 98 శాతంపైగా అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ. 40 కోట్లు, యనమదుర్రు డ్రెయిన్‌పై మూడు బ్రిడ్జిలకు అప్రోచ్‌లు నిమిత్తం రూ.36 కోట్లు, తాడేరు వంతెన నిర్మాణానికి రూ. 2 కోట్ల 50 లక్షలు, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు, నాడు, నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి రూ.22 కోట్ల నిధులను తీసుకువచ్చారన్నారు. జిల్లా కేంద్రంగా భీమవరాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీసుకురావడం మన అదృష్టమన్నారు. ఇంకా ఎన్నో శాశ్వత అభివృద్ధి పథకాలు గ్రామాలలో చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి కుమారి, కలిదిండి అప్పలరాజు, దాట్ల శ్రీనివాసరాజు, కార్యదర్శి కృష్ణ మోహన్, పెన్షన్ దారులు తదితరులు పాల్గొన్నారు.